
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి 3 ములుగు

గురువారం 20 జూన్ 2024





జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వసూల్ రాయుడు..!

- లీగల్, ఇల్లీగల్ వ్యాపారాల్లో చేతివాటం
- మంచిర్యాలలో విలాసవంతమైన బిల్డింగ్ నిర్మాణానికి శ్రీకారం

కటకటాల్లోకి కామ ఖాకీ!



కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 19: కామా తురాణం.. న సిగ్గు.. న లజ్జ.. అనే సామెత ఈ పోలీసుకు అతికినట్లుగా సరిపోతుంది. గౌరవ ప్రదమైన స్థానంలో ఉండి ప్రజలను రక్షించాల్సింది పోయి.. తనతో పనిచేసే తోటి ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడి కామాంధుడిగా మారిపోయాడు. అతగాడి కామలీలకు విసిగి వేసారిన బాధితురాలు.. ఎట్టకేలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో బహిర్గతమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంచలనం రేకెత్తించిన కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌గౌడ్ వ్యవహార శైలి పోలీసు శాఖకే మచ్చ తెచ్చినట్లయింది.

మహిళా కానిస్టేబుల్‌పై అత్యాచారం

తాను స్మార్ట్‌గా ఉంటానని, డైలీ జిమ్ చేయడంతో బాడీ ఫిట్‌గా ఉంటుందని తన కోరిక తీర్చాలంటూ ఎస్సై భవానిసేన్‌గౌడ్ ఆ ఉమెన్ హెచ్‌పీసీని లైంగికంగా వేధింపులకు గురిచేశాడు. 20 రోజుల కిందట తనకు ఫోన్ చేసి కాలు స్లిప్ అయి జారిపడ్డానని, కాలికి గాయం అయిందని, తన గదికి రావాలని కోరాడు. దీంతో బాధితురాలు ఎస్సై గదికి వెళ్లగా లైంగికంగా ప్రలోభానికి గురిచేశాడు. ఆ వెంటనే అతడి పోకడను పసిగట్టిన బాధితురాలు.. ఎస్సైని తోసేసి తన గదిలోకి పరుగెత్తుకుంటూ వెళ్లింది. మళ్లీ ఈ నెల 16వ తేదీన పాత కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో తాను నివాసముండే ఇంట్లో నిద్రిస్తున్న ఉమెన్ హెచ్‌పీసీని రాత్రి 1 గంటకు అదే భవనం 2వ అంతస్తులో ఉంటున్న ఎస్సై భవానిసేన్ కిటికీలోంచి ఆమె ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ఎస్సైని ప్రతిఘటించడంతో తన వద్ద ఉన్న గన్‌ను గురిపెట్టి బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టాడు. అత్యాచారం విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమెను బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో విచారణలో అధికారులు నిజాలను నిగ్గు తేల్చారు.

సీఎం దృష్టికి..

కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌గౌడ్ లైంగిక వేధింపుల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. వివిధ దినపత్రికలు, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అదికాస్తా సీఎం దృష్టికి వెళ్లింది. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకొని శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం తీవ్రంగా పరిగణించి చర్యలకు ఉపక్రమించింది. బాధితురాలి ఫిర్యాదుతో జిల్లా పోలీస్‌బాస్ కిరణ్‌ఖరే సూచనతో భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు, కాటారం, మహదేవపూర్ సీఐల నేతృత్వంలో ఆ ఎస్సైని అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. వైద్య పరీక్షలు సైతం ఆస్పత్రిలో చేయించి అత్యాచారం నిజమేననే నిర్ధారణకు వచ్చి చర్యలకు శ్రీకారం చుట్టారు. కాగా, ఇక్కడ జరిగిన ఉదంతంపై జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే.. మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్‌కు సమగ్ర నివేదికను పంపగా భవానిసేన్‌పై వేటు పడింది.



కోర్టులో హాజరుపరుస్తున్న క్రమంలో లోనికి పరుగులు తీస్తున్న నిందితుడైన భవానిసేన్

- మహిళా కానిస్టేబుల్‌పై అత్యాచారం కేసులో అరెస్టు
- కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌కు రిమాండ్
- ఉద్యోగంలో నుంచి డిస్మిస్?
- ఇద్దరు డీఎస్పీలు.. ఇద్దరు సీఐల నేతృత్వంలో విచారణ



నిందితుడు భవానిసేన్

రేప్ కేసు

లైంగిక వేధింపులు నిజమేనని తెలిసిన వెంటనే ఆ ఎస్సై వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌ను జిల్లా పోలీసు

మిగతా 6వ పేజీలో..

మహదేవపూర్, జూన్ 19: వ్యాపారమేదైనా పర్వాలేదు.. ఆయనకు వాటా ఇవ్వాల్సిందే.. గొడవ ఏదైనా సంబంధం లేదు.. తన చేయి తడపాల్సిందే.. లేదంటే తన ఆగ్రహానికి గురికాక తప్పదు.. అనే రీతిలో వ్యవహరించిన కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ వసూళ్లకు ఎట్టకేలకు కళ్లెం పడింది. తాను స్మార్ట్ అంటూ ఫోజులు కొట్టే పోలీసు వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారి కటకటాల పాలు కావాల్సి వచ్చింది. బెల్టు షాపులు, వైన్స్ షాపులు, ఇసుక, పీడీఎస్ రైస్, ఇతరత్రా లీగల్, ఇల్లీగల్ దందాల్లో ఆయన హస్తం తప్పనిసరిగా ఉండేది. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆయన వ్యవహార శైలి అందరికి ఇబ్బందిగానే ఉండేది. ప్రస్తుతం ఓ మహిళా హెడ్ కానిస్టేబుల్‌ను లైంగికంగా వేధించిన ఉదంతం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ఖాకీకి చివరకు సరైన శాస్తే జరిగిందనే టాక్ వినిపిస్తోంది.

బిల్డింగ్ కోసమేనా వసూళ్ల పర్వం?

ఇష్టానుసారంగా వసూళ్లు చేస్తున్న ఎస్సై భవానిసేన్ మంచిర్యాలలో విలాసవంతమైన బిల్డింగ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిసింది. ఇందుకోసం దొరికిన కాడల్లా తన చేతివాటం ప్రదర్శించాడనే ఆరోపణలు వినవస్తున్నా యి. ఇక్కడి నుంచే ఇసుక, కంకర, సిమెంట్, ఐరన్‌తో సహా నిర్మాణానికి కావాల్సిన ఇతరత్రా సామగ్రిని సమకూర్చినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు రాజకీయ నాయకుల అండతో చెలరేగిపోయాడని, సామాన్యులపై ప్రతాపం చూపాడనే విమర్శలు సైతం లేకపోలేదు. ఏదేమైనా గతంలో ఇక్కడ పనిచేసిన ఏ ఎస్సై వ్యవహరించని తీరును భవానిసేన్ వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

గతంలోనూ..

ఎస్సై భవానిసేన్‌గౌడ్ గతంలోనూ ఓ యువతిని వేధింపులకు గురిచేయడంతో సస్పెండ్ అయ్యారు. 2022, జూలై 12న ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యో గానికి సిద్ధమవుతున్న ఓ యువతిని సాయం పేరుతో మభ్యపెట్టి పోలీస్‌స్టేషన్‌కు రప్పించుకొని పలుసార్లు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. అప్పట్లో ఈ వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రముఖంగా ప్రచురించి వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన అధికారులు విచారణ జరిపి భవానిసేన్‌ను సస్పెండ్ చేశారు. అయితే, రాజకీయ పలుకుబడి పోలీసు ఉన్నతాధికారుల్లో తనకున్న పరిచయాలను ఆధారంగా చేసుకొని కేవలం మూడు నెలల వ్యవధిలో తిరిగి పోస్టింగ్ సంపాదించుకున్నాడు. తదుపరి జిల్లాలోని మహదే వపూర్ మండలం కాళేశ్వరం ఠాణా ఎస్సైగా 16 ఫిబ్రవరి, 2024న మళ్లీ ఆయన పోస్టింగ్ పొందాడు.

అవరోధాలను అధిగమిస్తేనే విజయతీరాలకు చేరుతారు

- యువత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించాలి
- మెగా జాబ్‌మేళాలో మంత్రి సీతక్క

ములుగు, జూన్ 19: అవరోధాలను అధిగమిస్తేనే విజయతీరాలకు చేరుతారని, జిల్లాలోని యువత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించాలని రాష్ట పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామంలో బుధవారం 52 కంపెనీలు 2వేల ఖాళీల ఉద్యోగాలతో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ 52 కంపెనీలతో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేయడం జరిగిందని, అనేక మంది యువత జాబ్‌మేళాలకు హాజరై ఉద్యోగాలు సాధించిన అనంతరం పది రోజులు విధులు నిర్వర్తించి ఇబ్బందులు ఎదురవుతున్నాయనే కారణంతో వచ్చిన అవకాశాన్ని వదిలేస్తున్నారని, అలాంటి కష్టాలను ఎదుర్కొని నిలబడితేనే విజయం వరిస్తుందని అన్నారు. జాబ్‌మేళా ద్వారా 7వ తరగతి నుంచి ఉన్నత చదువులు చదివిన యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని, ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని గ్రామీణ యువతకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించడం కోసం ములుగు జిల్లాలో త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ వచ్చిన ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలన్నారు. కష్టపడితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, ఉద్యోగం సాధించడం ద్వారా కుటుంబంలో ఆర్థికాభివృద్ధి వికసిస్తుందని తెలిపారు. అనంతరం జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన 700 మంది యువతీ, యువకులకు మంత్రి సీతక్క నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎస్పీ రవీందర్, వివిధ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



జలకళతో బొగత జలపాతం

బొగతకు జలకళ

వాజేడు, జూన్ 19: వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగార బొగత జలపాతం బుధవారం జలకళను సంతరించుకుంది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరదనీరు చేరి బొగత నిండుగా ప్రవహిస్తోంది. గత ఏడాది నవంబరులో కనుమరుగైన జలధారలు మరలా ఇప్పుడు కనువిందు చేస్తుండడంతో పర్యాటకులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. పర్యాటక ప్రాంతంగా పేరుగాంచిన బొగత వద్ద అటవీశాఖ అధికారులు మౌలిక వసతులు కల్పించే విధంగా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

కాటారం రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్ హోదా

- ఐఏఎస్ క్యాడర్ అధికారిని సబ్ కలెక్టర్‌గా నియమించడానికి ప్రభుత్వ ఉత్తర్వులు



కాటారం, జూన్ 19: కాటారం కేంద్రంగా ఏర్పాటైన నూతన రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్ హోదా దక్కింది. దీంతో రెవెన్యూ డివిజన్‌కు ప్రభుత్వం ఐఏఎస్ క్యాడర్ అధికారిని నియ మించడానికి ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్లను సబ్ కలెక్టర్ హోదాగా మార్చి ఆయా డివిజన్లకు ఐఏఎస్ క్యాడర్ అధికా రులను సబ్ కలెక్టర్లుగా నియమించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీవో 834 జారీ చేశారు. భూపాలపల్లి డివిజన్ పరిధిలో ఉన్న కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్‌రావు, పలిమెల మండలాలతో కలిపి కాటారం కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తున్నట్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 ఆగస్టులో గెజిట్ విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో కాటారం రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్ హోదా దక్కడంతో పాటు ఐఏఎస్ క్యాడర్ అధికారి సబ్ కలెక్టర్‌గా రానున్నారు. దీంతో ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అవకాశాలుంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.



రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ట్రెయినీ కలెక్టర్లు

రామప్పను సందర్శించిన ట్రెయినీ కలెక్టర్లు

వెంకటాపూర్(రామప్ప), జూన్ 19: మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని బుధవారం 2023 బ్యాచ్‌కు చెందిన ట్రెయినీ కలెక్టర్లు ఎంఎస్.ఉమాహారతి, అజ్మీరా సంకేత్‌కుమార్, ఎంఎస్.గరిమా నారుల, అభిగ్యాన్ మాలవీయ, అజయ్‌యాదవ్, మ్రినాల్‌శ్రేష్ట, ఐఈఎస్ఎస్‌డీ.మనోజ్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ వారిని సాదరంగా ఆహ్వానించగా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని అర్చకులు శాలువాలతో సన్మానించగా ఆలయ ప్రాముఖ్యత, కాకతీయుల చరిత్ర గురించి అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్, టూరిజం గైడ్ విజయ్‌కుమార్ వివరించారు. వారివెంట మర్రి చెన్నారెడ్డి ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, టూరిజం మార్కెటింగ్ మేనేజర్లు శ్రీనివాసరావు, రవి, ఆర్ఐ రమేష్ తదితరులు ఉన్నారు.

సమీకృత కలెక్టరేట్ పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూన్ 19: ములుగులోని సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం ఆయన ములుగు మండలంలోని బండారుపల్లి గ్రామ శివారులో 16ఎకరాల విస్తీర్ణంలో రూ.47కోట్ల నిధులతో నిర్మాణమవుతున్న కలెక్టర్ భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. వర్షాకాలంలో పనులకు అంతరాయం ఏర్పడితే అంతర్గత పనులను పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల పురోగతిని రోజువారీగా తెలియజేయాలని, పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టరేట్ నిర్మాణ బ్లూప్రింట్‌ను పరిశీలించారు. నిర్మాణ ఆకృతి, తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఈ వెంకటరమణ, ఏఈ రాకేష్, తహసీల్దార్ విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచనలు చేస్తున్న కలెక్టర్

నకిలీ విత్తనాల బెడదను అరికట్టాలి

- కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 19: రైతులు సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో నకిలీ విత్తనాల బెడదను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ టీంలు తనిఖీలను ముమ్మరం చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన, విద్య, ఎస్సీ అభివృద్ధి, పంచాయతీరాజ్ సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 2,43,240 ఎకరాల్లో వరి, పత్తి, మిరప తదితర పంటలు సాగు అవుతున్నాయని, రైతులకు ఎరువులు, విత్తనాల్లో ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో ఉన్న 45 రైతు వేదికల్లో విత్తనాల ఎంపికపై రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. 11 సహకార సంఘాల సొసైటీలు, 24 ఆగ్రోస్, 42 డీసీఎంఎస్ సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 31వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా 265 పాఠశాలల్లో మరమ్మతులు చేపడితే 65 పాఠశాల్లో పనులు పూర్తయినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫామ్స్‌ను వచ్చే నెల 15వ తేదీ నాటికి పంపిణీ పూర్తిచేయాలన్నారు. మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో విజయ్‌భాస్కర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు గనులు ప్రైవేటు

- ప్రైవేటీకరణ దిశగా సింగరేణి అడుగులు
- కాంట్రాక్ట్ పద్ధతిలో పెరుగుతున్న పనులు
- అండర్ గ్రౌండ్ గనులపై చిన్నచూపు
- భూపాలపల్లి ఏరియాలో తగ్గుతున్న కార్మికులు



కాకతీయఖని, జూన్ 19 : సింగరేణి యాజమాన్యం అండర్ గ్రౌండ్ గనులను చిన్నచూపు చూస్తుందనే విమర్శలు వస్తున్నాయి. బొగ్గు ఉత్పత్తికి కావాల్సిన యంత్ర పరికరాలను సకాలంలో అందించకుండా తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొగ్గు బావుల్లో ప్రైవేటు కాంట్రాక్ట్ పనులు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సింగరేణి కార్మికుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. యాజమాన్యం అండర్ గ్రౌండ్ గనుల ద్వారా నష్టాలు వస్తున్నాయని చెబుతూ వాటిని పూర్తి స్థాయిలో మూసివేసేందుకు చూస్తుందని పలు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. బొగ్గు ఉత్పత్తికి కావాల్సిన యంత్ర పరికరాలతో పాటు కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించేలా చర్యలు తీసుకుంటూ పూర్తిస్థాయిలో పని గంటలను వినియోగించుకోగలిగితే అండర్ గ్రౌండ్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి అధికంగా సాధించి నష్టాలను పూడ్చుకోవచ్చని పలువురు చెబుతున్నారు.

ప్రైవేటీకరణ దిశగా అడుగులు

సింగరేణి బొగ్గు గనులు పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేందుకు ఎక్కువ సమయం పట్టదని పలు కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. అందుకు నిదర్శనం భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌ల్లో బొగ్గు వెలికితీసే పనులను, అండర్ గ్రౌండ్ గనుల్లోని క్యాంటీన్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడమేనని వారు ఆరోపిస్తున్నారు. ఏరియాలో మొదటి నుంచి కార్మికులకు గని ప్రదేశంలో టీ, టిఫిన్లు అందించే పని సింగరేణి చూసుకునేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఆపని కొద్ది కొద్దిగా ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌ల్లో కేవలం మట్టి (ఓవర్ బర్డెన్) వెలికితీసే పనిని మాత్రమే కాంట్రాక్టర్లకు అప్పగించేవారని, బొగ్గు వెలికితీసే పనిని సింగరేణి సంస్థ కార్మికుల ద్వారా చేపట్టేదని చెబుతున్నారు. అయితే గత సంవత్సర కాలంగా మట్టిని తీసే పనితో పాటు బొగ్గు వెలికితీసే పనిని కూడా ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించారని అంటున్నారు. అండర్ గ్రౌండ్ గనులు సింగరేణి ఆధ్వర్యంలో నడిచేవని, ఇటీవల కేటీకే-8వ గనిలోని 2 సీమ్‌లను ప్రైవేటు సంస్థకు అప్పగించారని, సదరు కాంట్రాక్టర్ ఇచ్చిన టార్గెట్ చేరుకోలేక వెనుదిరిగినట్లు చెబుతున్నారు. అయితే మళ్లీ వేరే కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు సింగరేణి యాజమాన్యం పూనుకుందని కార్మిక సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఇదంతా సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకే కుట్రలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

పెరుగుతున్న ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు

సింగరేణిలో అండర్ గ్రౌండ్ గనులు తగ్గుముఖం పడుతూ ఓపెన్‌కాస్ట్ గనుల సంఖ్య పెరుగుతోంది. భూపాలపల్లి ఏరియాలో ఓసీ-3 ప్రాజెక్ట్ ప్రారంభం కాకుండా ఉంటే ఆస్థానంలో మూడు అండర్ గ్రౌండ్ గనులు వచ్చేవని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. అలాగే ఏరియాలో అండర్ గ్రౌండ్ గనులను తగ్గిస్తూ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను తీసుకొచ్చేందుకే యాజమాన్యం పూనుకుందని ఆరోపిస్తున్నారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేందుకు అండర్ గ్రౌండ్ గనుల కన్నా ఓపెన్‌కాస్ట్ గనులపై ఎక్కువ ఆధారపడుతున్నారని చెబుతున్నారు. అలా కాకుండా అండర్ గ్రౌండ్ గనులపై కూడా దృష్టి సారిస్తే మరింత బొగ్గు ఉత్పత్తిని సాధించే అవకాశం ఉంటుందని అంటున్నారు.

గడిచిన పదేళ్లలో ఏరియాలో పనిచేసిన కార్మికుల వివరాలు

సంవత్సరం	కార్మికులు
2012	7,271
2013	7,362
2014	7,120
2015	6,883
2016	6,882
2017	7,009
2018	6,728
2019	5,976
2020	5,997
2021	5,681
2022	5,452
2023	5,420
2024	5,380

తగ్గుతున్న కార్మికుల సంఖ్య

సింగరేణిలో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతూ వస్తోంది. పదేళ్ల క్రితం లక్షకు పైగా ఉన్న కార్మికుల సంఖ్య ప్రస్తుతం 35వేలకు పడిపోయిందంటేనే అర్థమవుతోంది. భూపాలపల్లి ఏరియాలో 2012 సంవత్సరంలో 7,271 మంది కార్మికులు ఉంటే ప్రస్తుతం 5,380 మంది పనిచేస్తున్నారు. అందుకు కారణం అండర్ గ్రౌండ్ గనులు తగ్గి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌ల సంఖ్య పెరగడమేనని పలువురు ఆరోపిస్తున్నారు. సింగరేణి యాజమాన్యం అధిక లాభాలను గడించేందుకు అండర్ గ్రౌండ్ గనులను మూసివేసి ఓపెన్‌కాస్ట్ గనులను తీసుకువస్తున్నారని కార్మిక సంఘాలు చెబుతున్నారు.

రైతులకు కేంద్రం ఊరట

14 రకాల పంటలకు మద్దతు ధరల పెంపు

వరంగల్ వ్యవసాయం, జూన్ 19: మూడోసారి ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరేంద్రమోదీ ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు ధరలను పెంచుతూ బుధవారం నిర్ణయం తీసుకుంది. కేంద్రం నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వారణాసిలో ప్రధానమంత్రి కిసాన్ సామ్మన్ నిధి పథకం 17వ విడత డబ్బులు రూ.20వేల కోట్లను నరేంద్రమోదీ రైతుల ఖాతా ల్లో జమ చేశారు. ఆ మరుసటి రోజే రైతులకు మరో మంచి వార్తను చెప్పడం విశేషం.

పెరిగిన పంట ధర

పంట	2024-25	పెంచినది
వరి ధాన్యం	రూ.2,300	117
వరి(ఏ గ్రేడు)	రూ.2,320	117
జొన్న	రూ.3,371	91
మక్కజొన్న	రూ.2,225	135
సజ్జలు	రూ.2,625	125
రాగులు	రూ.4,290	444
కందుల	రూ.7,550	550
పెసర్లు	రూ.8,682	124
మినుములు	రూ.7,400	450
వేరుశనిగ	రూ.6,783	406
సన్‌ఫ్లవర్	రూ.7,280	520
సోయా	రూ.4,892	292
నువ్వులు	రూ.9,267	632
ఒడిసెలు	రూ.8,717	983
పత్తి	రూ.7,521	501

కార్పెంటర్ యూనియన్‌కు సహకరిస్తాం..

కాళోజీ జంక్షన్, జూన్ 19 : కార్పెంటర్ యూనియన్‌కు అన్నివిధాలా సహకరిస్తామని జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. ఇటీవల నియమకమైన ఉమ్మడి జిల్లా కార్పెంటర్ యూనియన్ నూతన కార్యవర్గ నాయకులు బుధవారం హనుమకొండ సుబేదారిలోని కార్మికశాఖ కార్యాలయంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ రమేష్‌బాబును కలిసి గత కార్యవర్గాన్ని మార్చుతూ సర్వీస్ కాపీలో మార్పులు చేసి సర్టిఫైడ్ కాపీలు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పెంటర్ యూనియన్ తరపున రమేష్‌బాబు జన్మదినం సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పెంటర్ యూనియన్ కన్వీనర్ వీణవంక సదానందం, అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓ రమాదేవి నుంచి పదోన్నతి ఉత్తర్వులు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

పదోన్నతుల ఆర్డర్లు అందుకున్న ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఉత్వర్వులు అందుకున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని ఆయా మండలాల ఎంఈవోలు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. వరంగల్ జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 434 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధింగా, హనుమకొండ జిల్లాలో 454 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. అయితే వరంగల్ జిల్లాలో మాత్రం రోస్టర్ పాయింట్లలో తలెత్తిన సాంకేతిక కారణాలతో ప్రభుత్వ విభాగంలోని పీఈటీలు, లోకల్ బాడీలోని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు బుధవారం రాత్రి వరకు ఇంకా పూర్తి కాలేదు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా విజయభాను బాధ్యతల స్వీకరణ

బాలసముద్రం, జూన్ 19: టీజీ ఎస్‌ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌గా డి. విజయభాను మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ చార్మినర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ (ఆపరేషన్స్) మేనేజర్‌గా పనిచేసి పదోన్నతిపై వరంగల్ ఆర్‌ఎంగా వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం విజయభానును డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, డిపో మేనేజర్‌లు ఆర్‌ఎంకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్, జూన్ 19: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య కేంద్రం డిగ్రీ కోర్సుల పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ బుధవారం తెలిపారు. డీబార్డైన వారిలో హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్స్ సైన్స్ కళాశాలలో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కేయూలో వినియోగదారుల అధ్యయన కేంద్రం

జాతీయ వినియోగదారుల సమావేశంలో డిమాండ్



వినతి పత్రం అందచేస్తున్న చక్రపాణి

హనుమకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ విశ్వవిద్యాలయంలో వినియోగదారుల అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఢిల్లీలో జరుగుతున్న వినియోగదారుల జాతీయ సమావేశాల్లో ప్రధానంగా చర్చకు వచ్చింది. కన్స్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం పక్షాన పాల్గొన్న జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి ఈ అంశాన్ని లేవనెత్తారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో వినియోగదారుల అధ్యయన కేంద్రం లేకపోవడం లోటుగా ఉందన్నారు. వినియోగదారుల ఉద్యమం చురుకుగా సాగుతున్న వరంగల్‌లోని కేయూలో వినియోగదారుల హక్కుల రక్షణ, చైతన్యానికి అధ్యయన కేంద్రాన్ని తప్పక ఏర్పాటు చేయాలని కోరారు. ఈమేరకు ఒక తీర్మానాన్ని కూడా ఆయన ప్రవేశపెట్టారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శి నిధి ఖరేకు వినతి పత్రాన్ని కూడా సమర్పించారు. వినియోగదారుల జాతీయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్, క్యాట్కో చైర్మన్ శంకర్ లాల్ చౌరసాయి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెండోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ ఈ సందర్భంగా పాల్గొన్నారు. సమావేశాలకు సీసీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అనంత్ శర్మ అధ్యక్షత వహించారు.

పంతుళ్ల పదోన్నతుల్లో గందరగోళం

● పదోన్నతులు చేపట్టినా 40 శాతం ఖాళీలే.. ● పోస్టులున్నా అప్‌గ్రేడ్ కాని పండితులు ● పదోన్నతులు రాక నైరాశ్యంలో కొంత మంది ఎస్జీటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: విద్యాశాఖలో నిర్వహిస్తున్న పంతుళ్ల పదోన్నతుల ప్రక్రియ గందరగోళంగా ముగియనుంది. పదోన్నతులు చేపడితే ఖాళీలు భర్తీఅయ్యి అర్హత ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లభిస్తాయనే ఆశలు అడియాశలే అయ్యాయి. 25 ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వారిలో కొంతమందికి ఈ సారి పదోన్నతుల ప్రక్రియ సైతం నిరాశే మిగిల్చింది. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఒకటి కంటే ఎక్కువ పదోన్నతులు సాధించిన ఉపాధ్యాయులు ఒకే చోటుకు వెళుతుంటే.. మిగతా చోట్ల ఖాళీలు అలాగే ఉంటున్నాయి. దీంతో జిల్లాల్లో 40శాతం ఖాళీలు ఏర్పడుతున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. అర్హత సాధించినప్పటికీ కొంతమంది పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోవడం లేదు. సీనియారిటీ జాబితా ప్రకారం ముందుగానే ఒకటి కంటే ఎక్కువ పదోన్నతుల ఆప్షన్లు ఎంపిక చేసుకోవడంతో కొంతమందికి పదోన్నతులకు అవకాశం లేకుండా పోయింది.

ఇదిలాఉండగా, వరంగల్ జిల్లాలో ఐదుగురు తెలుగు పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోలేదు. హనుమకొండ జిల్లాలో 12 మంది తెలుగు పండిట్లు, 13మంది హిందీ పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోలేదు. ఇక వరంగల్ జిల్లాలో మాత్రం రోస్టర్ పాయింట్లలో తలెత్తిన సాంకేతిక కారణాలతో ప్రభుత్వ విభాగంలోని పీఈటీలు, లోకల్ బాడీలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు బుధవారం రాత్రి వరకు ఇంకా పూర్తి కాలేదు. మొత్తంగా ఈ సారి పదోన్నతుల ప్రక్రియ సైతం గందరగోళంగానే ముగుస్తున్నట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వరంగల్‌జిల్లాలో అన్ని కేటగిరీలల్లో కలిపి మొత్తం 434 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించగా, హనుమకొండ జిల్లాలో 454 మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందారు.

40 శాతం ఖాళీలే..

పదోన్నతుల ప్రక్రియలో ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్లుగాను, పండిట్లు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా పదోన్నతులు కల్పిస్తుంటే ఈ ప్రక్రియలో సైతం 40 శాతం ఖాళీలు ఏర్పడనున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులకు వారి అర్హతలను బట్టి రెండు, మూడు పదోన్నతులు వస్తున్నాయి. వారికి ఆ మేరకు ఉత్తర్వులు అందజేయడంతో వారు ఒకే ఒక పోస్టులో చేరనున్నారు. దీంతో మిగతా రెండు పోస్టులు ఖాళీలు ఏర్పడనున్నాయి. ఇలా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు సాఫ్ట్‌వేర్‌లో ఏర్పాటు చేయకపోవడంతో మళ్లీ పదోన్నతుల ప్రక్రియ జరిగేంత వరకు ఆ పోస్టులు ఖాళీలుగానే ఉండనున్నాయి. ఈ రకంగా సుమారుగా 40 శాతం ఖాళీలు అలాగే ఉండనున్నాయి.

అప్‌గ్రేడ్ కాని కొంత మంది పండితులు

దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదు అన్న చందంగా తయారయ్యింది రెండు జిల్లాల్లో పండితుల పరిస్థితి. జిల్లాల వారిగా కేడర్ స్ట్రెంత్ ప్రకారం పండితుల పోస్టులు అప్‌గ్రేడ్ అయినా అర్హత కలిగిన పండిట్లలో కొంతమందికి మాత్రం ఉన్నతీకరణ లేకుండా మొండిచేయే మిగిలింది. పోస్టులు అప్‌గ్రేడ్ అయినా కొంత మంది ఎల్పీలు మాత్రం అప్‌గ్రేడ్ కాలేదు.

వరంగల్ జిల్లాలో ఇలా...

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ విభాగంలో 16 ఎల్పీ తెలుగు పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. 8 మంది ఉపాధ్యాయులు ఉండగా, అందులో 5గురు ఉపాధ్యాయులకు మాత్రమే ఉన్నతీకరణ పోస్టుల్లో అవకాశం దక్కింది. మరో ముగ్గురు ఉపాధ్యాయులకు అవకాశం దక్కలేదు. వీరికి రోస్టర్ పాయింట్ల ప్రకారం ఉన్నతీకరణ దక్కడం లేదని అధికారులు చెబుతుంటే అధికారుల పొరపాటు వల్లనే తమకు ఉన్నతీకరణ దక్కలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

హనుమకొండ జిల్లాలో ఇలా...



హనుమకొండ జిల్లాలో పరిస్థితి మరోలా ఉంది. ఎల్పీ తెలుగులో మొత్తం 103 పోస్టులుండగా, అందులో 90 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. అయితే ఇందులో 90 మందికి మాత్రమే ఉన్నతీకరణ అవకాశం దక్కగా, మరో 12 మంది ఎల్పీ తెలుగు ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. ఇక హిందీ పండిట్ల విషయంలోనూ ఇదే మాదిరిగా జరిగింది. 106 పోస్టులుండగా అందులో 94 మందికి ఉన్నతీకరణ అవకాశం దక్కగా మరో 12 మందికి ఉన్నతీకరణ అవకాశం దక్కలేదు.

వింత పరిస్థితి

పదోన్నతుల ప్రక్రియ విద్యాశాఖలో వింత పరిస్థితిని నెలకొల్పింది. ఎల్పీల ఉన్నతీకరణలో భాగంగా కొన్ని పాఠశాలల్లో పోస్టు ఉన్నతీకరణ అయ్యింది. అయితే అక్కడ పనిచేస్తున్న సదరు ఉపాధ్యాయులకు మాత్రం ఉన్నతీకరణ దక్కలేదు. దీంతో ఉన్నతీకరణ అర్హత పొందిన ఉపాధ్యాయులు అదే పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడే ఉన్నతీకరణ పొందని ఉపాధ్యాయులు సైతం పనిచేయాల్సి ఉంటుంది.

ఇవీ ఉదాహరణలు

వరంగల్ మండల పరిధిలోని కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న హిందీ పండిట్ పోస్టు అప్‌గ్రేడ్ అయ్యింది. ఆ పోస్టులో పనిచేస్తున్న హిందీ పండిట్‌కు మాత్రం అప్‌గ్రెడేషన్ దక్కలేదు. దీంతో అప్‌గ్రేడ్ అయిన ఎల్పీతో పాటు అక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న ఎల్పీ సైతం పనిచేయాలి. కమలాపూర్ మండలంలోని మాదన్నపేట పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఎల్పీకి ఉన్నతీకరణ అవకాశం దక్కలేదు. కానీ పోస్టు మాత్రం ఉన్నతీకరణ అయ్యింది. దీంతో అక్కడ పనిచేస్తున్న ఎల్పీతో పాటు అప్‌గ్రేడ్ అయిన ఎల్పీ సైతం ఇక్కడే పనిచేయాల్సి ఉంది. అయితే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట ఇద్దరు ఎల్పీలు పనిచేయడం గమనార్హం.

జిల్లాల వారిగా పదోన్నతులు ఇలా...

	కేటగిరి	ప్రభుత్వ	లోకల్‌బాడి
వరంగల్ జిల్లాలో...	పీఎస్‌హెచ్ఎం(ఎల్ఎఫ్ఎల్)	7	56
	ఎస్ఏ ఇంగ్లీష్	5	10
	ఎస్ఏ గణితం	1	20
	ఎస్ఏ తెలుగు	5	105
	ఎస్ఏ బయోసైన్స్	7	22
	ఎస్ఏ హిందీ	5	88
	ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	10	42
	ఎస్ఏ ఫిజికల్ సైన్స్	1	2
	ఎస్ఏ సోషల్ స్టడీస్	10	38
	మొత్తం	**41**	**393**
హనుమకొండ జిల్లాలో...	పీఎస్‌హెచ్ఎం(ఎల్ఎఫ్ఎల్)	5	44
	ఎస్ఏ తెలుగు	3	87
	ఎస్ఏ హిందీ	6	88
	ఎస్ఏ ఇంగ్లీష్	4	13
	ఎస్ఏ గణితం	3	31
	ఎస్ఏ ఫిజికల్ సైన్స్	1	7
	ఎస్ఏ బయోసైన్స్	5	40
	ఎస్ఏ సోషల్ స్టడీస్	7	48
	ఎస్ఏ ఉర్దూ	2	0
	ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	8	48
	ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	0	1
	మొత్తం	**47**	**407**

ఒకే రాష్ట్రంలో రెండు విధానాలు సరికాదు..

డాక్టర్ ఎ. సదయ్య, ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి

ఒకే రాష్ట్రంలో రెండు విధానాలు సరికాదు. మల్టీజోన్-2లో రోస్టర్ పాయింట్ల ఆధారంగా అర్హత కలిగిన ఎల్పీలందరికీ ఉన్నతీకరణకు అవకాశం ఇస్తుంటే మల్టీజోన్-1లో మాత్రం పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. కానీ అందరికీ ఉన్నతీకరణ అవకాశం మాత్రం కల్పించడం లేదు. అధికారులు, ప్రభుత్వం పునరాలోచించి ఎల్పీలందరిని ఉన్నతీకరణ చేయాలి.

అర్హులైన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి

పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మన్నె చంద్రయ్య

అర్హులైన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మన్నె చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ డీఈవో కార్యాలయం ముందు పలువురు ఉపాధ్యాయులతో ఆయన నిరసన వ్యక్తం చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పలువురు ఎల్పీలకు ఉన్నతీకరణకు అవకాశం రాకపోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్హులైన వారందరికి న్యాయం చేకూర్చాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రూ.650 కోట్లతో బడ్జెట్?

నేడు బల్దియా ప్రత్యేక సమావేశం ● హాజరు కానున్న మంత్రి, ఎమ్మెల్యేలు



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 19: వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం బడ్జెట్ సమావేశం జరుగనుంది. ఈ బడ్జెట్ సమావేశంలో 2024- 2025 సంవత్సరానికిగాను రూ.650కోట్ల నిధుల ప్రతిపాదనలు, అమోదంపై సమీక్ష జరుగనుందని విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఈ యేడు ఎన్నికల కోడ్ రావడంతో మూడు మాసాలు గడిచి పోవడం వల్ల 9 నెలలకే ఈ బడ్జెట్ వర్తిస్తుందని చెప్పకొస్తున్నారు. మేయర్ గుండు సుధారాణి నిర్లక్ష్యం వల్లనే ఇప్పటి వరకు ఈ యేడు బడ్జెట్ సమావేశం, ప్రకటనలో జాప్యం జరిగిందని కొందరు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అయితే గత 2023-2024 బడ్జెట్‌లో రూ.523కోట్లు ప్రకటించారు. బల్దియాకు వివిధ రకాల ట్యాక్సీలు, భవనాల అద్దెల రూపంలో వచ్చే ఆదాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తాయి. సుమారు వంద కోట్ల వరకు బల్దియాకు పన్నుల రూపంలో సొంత ఆదాయం రాగా, మిగతా నిధులు ఎమ్మెల్యే, ఎంపీల్యాడ్స్‌తో పాటు నగర పాలక సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. ఈ నిధులతో సిబ్బంది జీతాలు, విలీన గ్రామాల అభివృద్ధి, శానిటేషన్, లోతట్టు ప్రాంతాల అభివృద్ధి, రోడ్లు, డ్రేనేజీల నిర్మాణం చేపట్టనున్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలు హాజరు

బల్దియాలో జరిగే బడ్జెట్ సమావేశానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలకు బల్దియా నుంచి రెండు రోజుల ముందుగానే ఆహ్వానం పంపించినట్టు తెలిసింది. వీరు సమావేశానికి హాజరై వరంగల్ నగరం అభివృద్ధిపై అంచనాలు, వ్యయంపై చర్చిస్తారు. ప్రధానంగా 66 డివిజన్‌లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసే ఆలోచనలో మంత్రి, ఎమ్మెల్యేతోపాటు మేయర్ ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

సమావేశంపై నీలినీడలు?

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం గురువారం బల్దియా కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు జరుగనుంది. ఈ సమావేశం నిర్వహణపై నాలుగు రోజుల ముందుగానే బల్దియా సర్వసభ్య సమావేశంలో సెక్రెటరీ విజయలక్ష్మి ప్రకటించారు. కాగా, రాష్ట్రంలో చాలా మున్సిపాలిటీలలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ప్రభుత్వ అనుమతితో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాయి. శాఖాపరంగా రావలసిన రాబడి, పోబడి గుర్తించి ప్రకటించి అమలు పరిచారు. కానీ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024-25 బడ్జెట్ ప్రకటించలేదు. అయితే కావాలనే మేయర్ బడ్జెట్ ప్రకటన జాప్యం చేసిందని పాలక వర్గంలోని కొందరు అసంతృప్త వర్గం కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అయితే గురువారం బల్దియా బడ్జెట్ సమావేశంపై నీలినీడలు అలుముకున్నాయి. అసంతృప్త కార్పొరేటర్లు బల్దియాలో బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించనున్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా, బీఆర్ఎస్ నుంచి మేయర్‌గా గెలిచి కాంగ్రెస్ పార్టీ నుంచి బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనడానికి సుధారాణి అనర్హురాలని వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ అశ్విని తానాజీని కలిసి వినతి పత్రం సమర్పించారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: పాలిసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ నెల 20 (గురువారం) నుంచి ప్రారంభం కానున్నట్లు పాలిసెట్-2024 వరంగల్ కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 24 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్స్ కోసం స్లాట్‌లను బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్‌లు బుక్ చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 22 నుంచి 25 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. 22 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని, 30న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 30 నుంచి జూలై 4 వరకు వెబ్‌పోర్టల్ ద్వారా అడ్మిషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

హనుమకొండ కలెక్టరేట్, జూన్19: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ (గుర్తింపుకార్డు) గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల కోసం రెండేళ్లకోసారి అక్రిడిటేషన్ కార్డుల సదుపాయం రాష్ట్ర సమాచార శాఖ కల్పిస్తుంది. ఆ గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తుండటంతో గడువు తేదీని 3నెలలు (సెప్టెంబర్ 30వరకు) పొడిగించినట్లు హనుమంతరావు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం

వరంగల్ మెడికల్, జూన్ 19: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బిసాంబశివరావు తెలిపారు. 1 నుంచి 19 యేళ్ల వయస్సు గల పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు ఇప్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ మాత్రలో భోజనం అనంతరం ఇస్తారన్నారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఏవైనా కారణాలతో అందుబాటులో లేని పిల్లలకు ఈ నెల 27వ తేదీన మాప్ ఆప్ డే రోజు ఇస్తారన్నారు. హనుమకొండలోని బీఈడీ కాలేజీ పక్కన ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 12.30 గంటలకు ఈకార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 19: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌శర్మను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో గల ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే పూలమొక్క అందించి శాలువాతో సన్మానించారు.

ముగిసిన ఈపీ ఆపరేటర్ల పరీక్ష

కాకతీయఖని, జూన్ 19 : సింగరేణి ఈపీ ఆపరేటర్ ట్రైనీ డ్రైవింగ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ బుధవారం ముగిసింది. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో రెండవ రోజు జరిగిన డ్రైవింగ్ పరీక్షలో 87 మందికి 81 మంది హాజరయ్యారు. ఇందులో 41 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏరియాలో మొత్తంగా 171 మంది దరఖాస్తు చేసుకోగా 14 మంది గైర్హాజరు అయ్యారు. 64మంది కార్మికులు కొత్తగూడెంలో ఈ నెల 30న జరగనున్న రాత పరీక్షకు హాజరు కానున్నారు. కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, జ్యోతి, తుకారాం, రాజగోపాల్, గుండు రాజు యాదవ్, సాధన్ పాల్గొన్నారు.

బ్లాక్-7లో కొనసాగుతున్న మరమ్మతు పనులు

మహదేవపూర్ రూరల్, జూన్ 19 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కుంగిన మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బ్లాక్-7లో ఉన్న 20వ గేటు తొలగింపు పనులు మంగళవారం ప్రారంభం కాగా బుధవారం కొనసాగాయి. బ్లాక్-7లో మొత్తం 11 గేట్లుండగా 10 గేట్లను సాధారణ పద్ధతిలో ఎత్తగా కుంగుబాటు ప్రభావం అధికంగా ఉన్న 20వ గేటును ఆర్క్ గ్రౌగింగ్ పద్ధతిన కట్ చేశారు. బ్యారేజీ కిందున్న అగాథాన్ని పూడ్చేందుకు చేపట్టిన గ్రౌటింగ్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. షీట్ ఫైల్స్ అమరిక పనులు కొనసాగుతుండగా పనుల్లో వేగం పెంచేందుకు ఉన్న మిషీన్‌స్థానంలో మరో మిషీన్‌తో పనులు చేపట్టనున్నట్లుతెలిసింది.సీసీబ్లాకుల పునరుద్ధరణపనులు కొనసాగుతున్నాయి.

డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ మృతి

వాజేడు, జూన్ 19 : మండలంలోని పేరూరులో ఉన్న డీసీసీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.నరేష్ యాదవ్(35) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించి మండలంలోని ధర్మవరంలో అద్దెకు ఉంటున్న ఇంట్లో మృతి చెందారు. నరేష్ యాదవ్ స్వస్థలం ఖమ్మం కాగా భార్యతో విభేదాలు ఉండటంతో ఇక్కడే ఉంటున్నారు. నరేష్ మృతి చెందిన విషయాన్ని కుటుంబ సభ్యులకు స్థానికులు అందించారు. ఆయన మృతి పట్ల బ్యాంకు సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

బెటాలియన్‌ను సందర్శించిన ట్రైయినీ ఐపీఎస్‌లు

గోవిందరావుపేట, జూన్ 19 : మండలంలోని చల్వాయి గ్రామంలో గల తెలంగాణ స్పెషల్ పోలీస్ ఐదవ బెటాలియన్‌ను ట్రైయినీ ఐపీఎస్ అధికారులు బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు అనిల్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి బెటాలియన్ అడ్మినిస్ట్రేషన్, ఫంక్షనింగ్, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. అనంతరం బెటాలియన్ పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ఐ కార్తీక్, అధికారులు అన్నయ్య, రాంప్రసాద్, సల్మాన్‌రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలివ్వాలి

ములుగు కలెక్టరేట్, జూన్ 19: రైతుల రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులో బుధవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా అనేక మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేవని, దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఏమీ అందడం లేదని అన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు లేని రైతులను గుర్తించి పట్టాలందించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గోదావరి జలాలను జిల్లాలోని వ్యవసాయ రంగానికి అందించాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. నాయకులు కొర్ర రాజు, ఎమ్డీ.గఫూర్‌పాషా, రత్నం ప్రవీణ్, ఎమ్డీ.సద్దాంహుస్సేన్, కె.రవీందర్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ వ్యాధిని నిర్మూలిద్దాం

▸▸ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

ములుగు కలెక్టరేట్, జూన్ 19 : సమాజం నుంచి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలిద్దామని, ఈ వ్యాధిపై గిరిజన గ్రామాల్లో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం ములుగులోని ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన, నిర్ధారణ పరీక్షల కార్యక్రమం జరగగా కలెక్టర్ టీఎస్.దివాకర్, అదనపు కలెక్టర్ పి.శ్రీజలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి రాకుండా ప్రజలు చూసుకోవాలని, రక్త మార్పిడి వంటివి చాలా కష్టంగా ఉంటాయన్నారు. ఈ వ్యాధితో ఎవరూ చనిపోకూడదని, వ్యాధి వచ్చిన వారికి, నిర్ధారణ జరిగిన వారికి కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు, రోగ నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలన్నారు.

కలెక్టర్ దివాకర మాట్లాడుతూ యుక్త వయసు అమ్మాయిలలో ఎక్కువగా సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వస్తుందని, జిల్లాలో 2,300 మందికి పరీక్షలు నిర్వహించగా 20 మందికి నిర్ధారణ అయిందని అన్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాపించకుండా కట్టడి చేయాలని అన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అపయ్య మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందని, దీంతో ఎర్ర రక్తకణాలు కొడవలి రూపంలో ఉండి రక్తహీనతకు దారితీస్తుందని అన్నారు. అనంతరం మంత్రి సీతక్కతోపాటు కలెక్టర్ దివాకర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పోరిక రవీందర్, డెమో తిరుపతయ్య, మానిటరింగ్ సూపర్‌వైజర్‌లు దుర్గారావు, సంపత్, భాస్కర్, సంపత్‌రావు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

• వెంకటాపూర్(రామప్ప) : సికిల్‌సెల్ ఎనీమియా రహిత సమాజమే లక్ష్యంగా వైద్యసిబ్బంది పనిచేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా నిర్దేశించాయని అన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సదానందం, ఏఎన్‌ఎం సూర్యకాంతమ్మ, ఎల్‌టీ కృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

• గోవిందరావుపేట : మండలంలోని కర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం హెచ్‌ఎం కల్తి శ్రీనివాస్



ములుగులోని ఏరియా ఆస్పత్రిలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆధ్వర్యంలో సికిల్‌సెల్ అనీమియా ప్రోగ్రాం(రక్తహీనత)పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడే వారిలో నొప్పులు, కాళ్లు, చేతుల వాపులు, ఇన్ఫెక్షన్లు తరచుగా రావడం, పెరుగుదలలో జాప్యం, దృష్టి సమస్యలు సంభవిస్తాయని అన్నారు. ఈలోపం వల్ల ఎర్రరక్త కణాలు గుండెకు వెళ్లే సమయంలో పగిలిపోయి ప్రాణాంతకంగా మారుతాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

• తాడ్వాయి : సికిల్‌సెల్ వ్యాధిని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ పాటుపడాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రణధీర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన, వ్యాధి నిర్ధారణ పరీక్షల కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన విద్యార్థినులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

• వెంకటాపురం(నూగూరు): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని సీతారామపురం గ్రామంలో వైద్యశిబిరం జరగగా ఆమె పాల్గొని గ్రామస్థులకు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సికిల్‌సెల్ దినోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

• ఏటూరునాగారం : ఏజెన్సీలో సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించాలని ఐటీడీఏ ఏపీవో, మండల ప్రత్యేకాధికారి జె.వసంతరావు, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ క్రాంతికుమార్ అన్నారు. ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ఆశ్రమ పాఠశాలలో ములుగు జిల్లా గిరిజన సంక్షేమ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ సికిల్ సెల్ అనీమియా(రక్తహీనత) నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏజెన్సీలో సికిల్ సెల్ వ్యాధి రాకుండా చూసుకోవాలని, రక్త మార్పిడి లాంటివి చాలా కష్టంగా ఉంటాయని, వ్యాధి సోకిన వారికి వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాధికి సంబంధించిన వివరాలపై అవగాహన కల్పించి విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. అంతేకాకుండా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రొయ్యూరు పరిధిలోని మూడవ సబ్ సెంటర్‌లో అవగాహన కల్పించగా, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎమ్డీ.వలియాబీ హాజరయ్యారు. కార్యక్రమంలో రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సుమలత, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సరైన అవగాహనతో వ్యాధిని నివారించవచ్చు : ఎమ్మెల్యే

భూపాలపల్లిటౌన్ : సరైన అవగాహనతోనే సికిల్‌సెల్ వ్యాధిని నివారించవచ్చునని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం భూపాలపల్లి పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ సికిల్‌సెల్ వ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడారు. ప్రజలు సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై అవగాహనతో ఉండాలన్నారు. ఆ వ్యాధిని సరైన సమయంలో గుర్తించకపోవడం మూలంగా చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనిపై జిల్లా వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

• కాటారం : మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ సికిల్‌సెల్ అనీమియా అవగాహన దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రవిశంకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. 15 రోజుల పాటు సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్‌ఎం రవిశంకర్ తెలిపారు. సికిల్‌సెల్ అనీమియా అధికంగా గిరిజన తెగల్లో ఉందని, అందరు పౌష్టికాహారం తీసుకుంటేనే రక్తహీనత సమస్యను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దివ్యశ్రీ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

• మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారి నాగరాణి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. రక్తహీనత జబ్బుకు సరైన మందులు లేవని, వ్యాధి బారిన పడినవారు ముందస్తుగా నిర్ధారణ పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఇన్‌చార్జ్ ఎంపీడీవో హుస్సేన్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటస్వామి, సూపర్‌వైజర్ సునీత, వైద్యసిబ్బంది భిక్షపతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో అన్యాయం : డీటీఎఫ్

భూపాలపల్లిటౌన్, జూన్ 19 : పదోన్నతుల ప్రక్రియలో ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కొంత మంది ఉపాధ్యాయులలో ఒకటి, రెండు, మూడు సబ్జెక్టుల్లో ప్రమోషన్లు వచ్చాయని తెలిపారు. సీనియారిటీ క్రమంలో పలువురు ఉపాధ్యాయులకు రావాల్సిన ప్రమోషన్లలో అన్యాయం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయిలోనే ప్రమోషన్ల ప్రక్రియ విధానంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. కాగా, దీనిని పరిశీలించి సవరించాలని డిమాండ్ చేశారు.

210 మందికి పదోన్నతులు

▸▸ ఇంకా 94 మందికి పెండింగ్

భూపాలపల్లిటౌన్, జూన్ 19: జిల్లాలోని 210 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు సమాన స్థాయి నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు డీఈవో రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగు 61, ఆంగ్లం 14, గణితం 7, ఫిజికల్ సైన్స్ 7, బయోలాజికల్ సైన్స్ 23, సోషల్ 25, స్పెషల్ ఎడ్యుకేషన్ 1, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్స్ 44 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. అలాగే 66 మంది హిందీ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు, ఫిజికల్ డైరెక్టర్లు 28 మందికి ప్రమోషన్లు కల్పించనున్నట్లు డీఈవో రామ్ కుమార్ పేర్కొన్నారు.

ములుగు జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

▸▸ మంత్రి ధనసరి సీతక్క

వెంకటాపూర్(రామప్ప), జూన్ 19: రాష్ట్రంలోనే ములుగు జిల్లాను ప్రగతి పథంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని, ఇందుకోసం అధికారులు సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.49.53లక్షల నాబార్డు నిధులతో నిర్మించనున్న మిషన్ భగీరథ అంతర్గత తాగునీటి పైపులైన్ పనులను ఆమె కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా తాగునీటి పైపులైన్లు లీకేజీ కావడం వల్ల ప్రజలు కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. అలాంటి ఘటనలు ఈప్రాంతంలో జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ వెంటవెంటనే మరమ్మతులు చేయాలన్నారు. వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లకు నల్లా కనెక్షన్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకోసం నూతన పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు.

కలెక్టర్ దివాకర మాట్లాడుతూ నూతన పైపులైన్ ద్వారా 12 వార్డుల్లోని 450 ఇళ్లకు సురక్షిత మంచినీటిని సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేష్, డీఈ అజహర్ సయ్యద్, ఎంపీపీ బుర్ర రజిత, ఎంపీటీసీలు జంగిలి శ్రీలత, పోశాల అనిత, తహసీల్దార్ సదానందం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, నాయకులు బండి శ్రీనివాస్, మిల్కూరి ఐలయ్య, శ్రీనివాస్, జంగిలి రవి, మామిడిశెట్టి కోటి తదితరులు పాల్గొన్నారు.

పేరూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణప్రసాద్

వాజేడు, జూన్ 19: మండలంలోని పేరూరు పోలీస్‌స్టేషన్ ఎస్సైగా గుర్రం కృష్ణప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఎస్సైల బదిలీల్లో ఆయనను ఏటూరునాగారం నుంచి పేరూరుకు బదిలీ చేయగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన వాజేడు పోలీస్‌స్టేషన్‌లో సుమారు మూడున్నరేళ్లపాటు విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల రాస్తారోకో

కాటారం, జూన్ 19 : కాటారంలోని అంబేద్కర్ కూడలిలో కాటారం జీపీ పారిశుధ్య కార్మికులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. గత కొన్ని నెలలుగా తమకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ వేతనాలు అందకుంటే బతికేదెట్లా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో తాము ఇబ్బందులు పడతూ పనులు చేస్తే కొద్దిపాటి వేతనాలు కూడా సకాలంలో రావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు జీపీ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


భూపాలపల్లిలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూన్ 19: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరిపారు. భూపాలపల్లి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కేక్ కట్‌చేసి సంబరాలు జరిపారు. రాహుల్‌గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని, కాంగ్రెస్ పార్టీతోనే పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లూరి మధు, బుర్ర కొంరయ్య, ఇస్లావత్ దేవన్, ముంజాల రవీందర్, రంజిత్, నిర్మల, తాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

• కాటారం : మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడటానికి పాదయాత్ర నిర్వహించారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, ఎంపీటీసీ రవీందర్‌రావు, నాయకులు దబ్బెట రాజేశం, దుర్గం రాజబాబు, మంత్రి నరేష్, వెంకట్ రెడ్డి,ప్రభాకర్, శకుంతల, శంకర్, తిరుపతిరెడ్డి, రాజ్‌కుమార్‌పాల్గొన్నారు.

• చిట్యాల : కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

• గణపురం : కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్ ఆధ్వర్యంలో వేడుకలు జరుగగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అప్పం కిషన్, రాజయ్య, భువనసుందర్, శంకర్, దుర్గయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

• టేకుమట్ల : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ 54వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షుడు మాదం కొంరయ్య, ప్రధాన కార్యదర్శి బండి రవీందర్, కోశాధికారి శాస్త్రాల కిరణ్, నాయకులు లింగంపల్లి స్వామిరావు, కొయ్యాల చిరంజీవి, దొంతుల శ్రీనివాస్, బిక్కినేని సంపత్‌రావు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఏటూరునాగారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎమ్డీ.అయ్యూబ్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, యూత్ ప్రధాన కార్యదర్శి ఎమ్డీ.గౌస్ పాషా పాల్గొన్నారు.

• వెంకటాపురం(నూగూరు) : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నాయకులు కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, నాయకులు చిడెం శివ, బాలసాని వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కటకటాల్లోకి కామ ఖాకీ!

(3వ పేజీ తరువాయి)

ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకు న్నారు. అలాగే బాధితురాలి ఫిర్యాదుతో తాను విధులు నిర్వర్తించిన కాళేశ్వరం ఠాణాలోనే భవానిసేన్‌పై ఐపీసీ 449,376(2)324, 506 సెక్షన్ల కింద రేప్ కేసు నమోదు చేశారు. అనంతరం మహదేవపూర్ ఎస్సై పవన్, సీసీఎస్ సీఐ రవిందర్ నేతృత్వంలో ఆయన్ను భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ అడిషనల్ కోర్టులో బుధవారం రిమాండ్‌కు తరలించారు. మరోవైపు ఆయనను విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

పారిపోయే ప్రయత్నం?

కేసు తీవ్రతరమవుతుందని భావించిన భవానిసేన్ పోలీసుల కళ్లుగప్పే ప్రయత్నం చేశాడు. అతనిపై వచ్చిన లైంగిక వేధింపులపై విచారణలో భాగంగా భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తీసుకెళ్తుండగా పారిపోయే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. స్వతహాగా తన వద్దకు ప్రయివేటు కారును రప్పించుకొని అందులో పరారయ్యే యత్నం చేసినట్లు సమాచారం. ఆవెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆయన ప్రయత్నాన్ని విఫలయత్నం చేశారు. తన వెంబడే ఇద్దరు పోలీసులను గస్తీగా ఉంచి నిరంతరం ఆయనపై ఓ కన్నేసి ఉంచారు.

బాలుడిపై అట్రాసిటి కేసు నమోదు

చిట్యాల, జూన్ 19: మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన బాలుడిపై అట్రాసిటి, అటెమ్ట్ మర్డర్ కేసు నమోదైనట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఒడితలకు చెందిన బాలుడు అదే గ్రామానికి చెందిన ఓ మహిళ వలన తమ ఇంట్లో అమ్మనాన్నలకు తరుచూ గొడవలు జరుగుతున్నాయనే అనుమానంతో కత్తితో దాడి చేసినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దాడికి పాల్పడిన బాలుడిపై అట్రాసిటీ, అటెమ్ట్ మర్డర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

భూపతిపూర్‌లో బాలిక ఆత్మహత్య

తాడ్వాయి, జూన్ 19: మండలంలోని భూపతిపూర్‌లో బుధవారం ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక పోలీసులు తెలిపిన ప్రకారం... గ్రామంలోని కోడెం మల్లయ్య-పద్మ దంపతుల కుమార్తె అంకిత(15) తరచూ సెల్‌ఫోన్‌లో వీడియోలు చూస్తూ మాట్లాడుతుండడంతో తల్లి పద్మ పలుమార్లు హెచ్చరించేది. అయినప్పటికీ అంకితలో ఎలాంటి మార్పు రాకపోవడంతో బుధవారం తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అంకిత ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన కుటుంబసభ్యులు 108 ద్వారా ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అంకిత మృతి చెందిందని నిర్ధారించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై సింగరేణి కార్మికుడి మృతి

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 19: మద్యానికి బానిసై సింగరేణి కార్మికుడు మృతి చెందిన ఘటన భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని కృష్ణకాలనీలో నివాసం ఉంటున్న మూడ కృష్ణ(46) అనే వ్యక్తి సింగరేణి కార్మికుడిగా ఓసీ-3లో విధులు నిర్వర్తిస్తున్నాడు. అతని భార్య ఎనిమిదేళ్ల కిందట మృతి చెందగా ఒంటరిగా ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన ఆయన తరచూ మద్యం సేవిస్తూ ఉండేవాడు. దీంతో బుధవారం ఉదయం కృష్ణకాలనీలోని అటవీ ప్రాంతంలో మృతి చెంది ఉన్నాడన్నారు. స్థానికులు సమాచారం అందించగా అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం చేయించినట్లు తెలిపారు. మద్యం సేవించి ఉండటంతో అతన్ని ఎవరూ గమనించక మరణించాడని చెప్పారు. ఈ మేరకు అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసునమోదు చేసినట్లు ఎస్సై స్పష్టం చేశారు. కాగా, కృష్ణకు నలుగురు కుమారులు కాగా, వారంతా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

కాటారం, జూన్ 19: వానాకాలంలో భారీ వర్షాలు, వరదలతో వచ్చే సమస్యలు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎంపీపీ అధ్యక్షతన ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. వానాకాలం నేపథ్యంలో తీసుకునే చర్యలు, చేపట్టాల్సిన జాగ్రత్తలపై జీపీ ప్రత్యేక అధికారులు, ఇతర శాఖల అధికారులతో ఎంపీపీ సమ్మయ్య, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ నాగరాజు సమీక్షించారు. భారీ వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలు, రోడ్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. గతంలో దెబ్బతిన్న రోడ్లు, చెరువుల మరమ్మతులను వేగవంతం చేయాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. సమావేశంలో ఎంపీవో ఉపేంద్రయ్య, పీహెచ్‌సీ డాక్టర్ సుమన్, ట్రాన్స్‌కో ఏఈ మేఘనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, ఏపీవో వెంకన్న, డీటీ రాంమోహన్, మిషన్ భగీరథ ఏఈ కళ్యాణ్, వెటర్నరీ వైద్యుడు అభిషేక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 19: గోదావరి వరద ముంపునకు గురవుతున్న ఆదివాసీలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆదివాసీ నవ నిర్మాణసేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి స్వర్ణలత, తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌లకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలం సీజన్‌లో గోదావరి వరదకు యాకన్నగూడెం ముంపునకు గురవుతుందని, దీంతో సమీపంలోని అటవీప్రాంతంలో గ్రామస్థులు నివాసం ఉండాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. వరదలకు ఇళ్లలోకి నీరు చేరి పాములు, తేళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ముంపు ప్రాంత ప్రజలకు సురక్షిత ప్రాంతాల్లో ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, మహేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల, జూన్ 19: వర్షాకాలం పూర్తయ్యేంత వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీవో సురేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. గత వర్షాకాలం భారీ వర్షాల కారణంగా వివిధ రకాలుగా నష్టం జరిగిందని, వాటిని దృష్టిలో ఉంచుకొని ఆయా శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు అన్ని గ్రామాలలోని చెరువులను పరిశీలించి మరమ్మతులు పనులుంటే వెంటనే పూర్తి చేయాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వైద్యశాఖ అధికారులు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా

▸▸ ప్రైవేట్ పాఠశాలలో బుక్స్ విక్రయిస్తున్నారని ఆందోళన

కాటారం, జూన్ 19: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం ధర్నా చేశారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారంటూ వాటిని స్వాధీనం చేసుకుని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరణ్ ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేపట్టారు. జిల్లాలో నిబంధనలు పాటించకుండా పుస్తకాలు, యూనిఫామ్స్ పేరిట అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న, ప్రచారం కోసం విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరణ్ డిమాండ్ చేశారు. అడ్డగోలు ధరలకు బుక్స్ అమ్ముతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల్లో అధికారులు తనిఖీలు చేసి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, సాగర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు న్యాయం జరిగేవరకు పోరాడుతాం

వెంకటాపురం(నూగూరు), జూన్ 19: మండలంలోని కొమురంభీం కాలనీ ఆదివాసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం నాటికి పదో రోజుకు చేరుకుంది. ఈ శిబిరంలో యాకన్నగూడెం ఆదివాసీ మహిళలు సంఘీభావంగా పాల్గొన్నారు. అధికారులు స్పందించి ఆదివాసీల భూ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ శిబిరంలో నాయకులు పూనెం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.